మార్పు కోసం...
# మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

విలేకరులు కావలెను
హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను
మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 218 30 మంగళవారం, జనవరి 2024 పేజీలు: 4/వెల రూ5/-

## స్పీచ్‌ల్లో నిర్మలమ్మదే రికార్డు..!

### ఆర్థిక మంత్రులు బడ్జెట్ ప్రసంగాలకు ఇలా ప్రియారిటీ..

**జనవరి29(మరో ఉదయం)**



75 వసంతాల గణతంత్ర భారతదేశంలో ప్రతియేటా వార్షిక బడ్జెట్లు ప్రవేశ పెట్టడం సంప్రదాయంగా వస్తున్నది. ఆయా ప్రభుత్వాల్లో ఆర్థిక మంత్రులు తమ వెసులుబాటుకు అనుగుణంగా సుదీర్ఘంగా, అతి స్వల్ప ప్రసంగాలతో ముగించారు. భారతదేశ బడ్జెట్లకు కూడా ఓ చరిత్ర ఉంది. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 2019లో రెండో విడత అధికారం చేపట్టిన నరేంద్రమోదీ ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్ ప్రవేశ పెడుతున్నది. ఎన్నికల వేళ వివిధ వర్గాలను ఆకట్టుకోవడానికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంక్షేమ పథకాలు, పన్ను రాయితీలు ప్రకటిస్తారా.. లేదా.. అన్నది వేచి చూడాల్సి ఉంది. ఎన్నికలు పూర్తయిన తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెడతారు. ఇప్పటి వరకు పార్లమెంట్‌కు బడ్జెట్ సమర్పించిన ఆర్థిక మంత్రుల ప్రసంగాల్లో నిర్మలా సీతారామన్‌దే రికార్డు

# ఆరోగ్యశ్రీ, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌పై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- ఆరోగ్యశ్రీకి తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి అనే నిబంధనను సడలించే అంశాన్ని పరిశీలించాలని సూచన
- రాష్ట్రంలో అందరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌ను సిద్ధం చేయాలన్న ముఖ్యమంత్రి
- అత్యవసర సమయంలో సరైన వైద్యం అందించేందుకు ఉపయోగపడుతుందని వెల్లడి

**జనవరి29(మరో ఉదయం)**



ఆరోగ్యశ్రీకి తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి అనే నిబంధనను సడలించే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం అధికారులకు సూచించారు. ఈ నిబంధన కారణంగా ఆరోగ్యశ్రీ కార్డు కోసం తెల్ల రేషన్ కార్డు తీసుకునే వారి సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నిబంధనను పరిశీలించాలన్నారు. ఇదే సమయంలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌పై ముఖ్యమంత్రి దృష్టి సారించారు తెలంగాణలో ప్రతి ఒక్కరికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డును ఒక యూనిక్ నెంబరుతో అనుసంధానం చేయాలన్నారు. అలా చేయడం వల్ల ఏదేని అత్యవసర పరిస్థితుల్లో సరైన వైద్యం అందించడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. హెల్త్ ప్రొఫైల్ కార్డుతో ఆరోగ్యశ్రీని అనుసంధానం చేయాలని అధికారులను ఆదేశించారు.

# అభివృద్ధి కోసం పదేళ్లపాటు కష్టపడ్డాం



- మహాలక్ష్మితో ఆటోడ్రైవర్లకు గోస
- ఎక్కడా 24 గంటల కరెంట్ రావడం లేదు
- చేవెళ్ల అసెంబ్లీ సమీక్షలో కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,జనవరి29(మరో ఉదయం)**

పదేండ్లు ఎంతో కమిట్‌మెంట్‌తో పనిచేశామని.. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సర్కారును నడిపించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మూడోవంతు సీట్లను ఇచ్చి బలమైన ప్రతిపక్షంగా పనిచేయమని ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదేశించా రని చెప్పారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్పు అనే పేరుతో అమాయకులైన యువతను కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. ఆరున్నర లక్షల మంది ఆటో డ్రైవర్లను సర్కారు గోసపెడుతు న్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఎక్కడా 24 గంటల కరెంటు రావడం లేదని చెప్పారు. రైతుబంధు అడిగితే చెప్పుతీసి కొడతామని అంటున్నారని విమర్శించారు. రైతుభరోసా ఇచ్చామంటూ అంతర్జాతీయ వేదికలపై అబద్ధం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులను చెప్పుతో కొడతా మంటున్న కాంగ్రెస్‌ను ఓటుతో కొడదామన్నారు. అధికారంలో వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణం మాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి చెప్పారని, ఇప్పటికీ అది అమలుకాలేదని చెప్పారు. రుణం తెచ్చుకున్న రైతులకు మొండి చేయి చూపించారని విమర్శించారు. డిసెంబర్ 9న రుణమాఫ్గీ ÷లుపై సంతకం చేస్తామని రేవంత్ చెప్పారని గుర్తుచేశారు. తాము ప్రభుత్వంలో ఉన్నామనే విషయాన్ని కాంగ్రెస్ మర్చిపోయినట్లుందని ఎద్దేవాచేశారు. కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఎప్పటి నుంచి ఇస్తారని ప్రశ్నించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ ప్రసంగం సామాన్య కాంగ్రెస్ కార్యకర్త ప్రసంగం కంటే హీనంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలిచ్చిందని, ఆ హామీలను అమలు చేయకుంటే బట్టలిప్పి నిలబెడతా మన్నారు. నోటికొచ్చిన హామీలిచ్చి ఇరుక్కుపోయారని విమర్శించారు. కాంగ్రెస్ ఐదేండ్లు అధికారం నిలుపుకుంటుందా.. లేదా వేచి చూద్దామన్నారు. పార్లమెంటు ఎన్నిల కోడ్ రాకముందే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బెదిరింపులకు బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దని సూచించారు. ఎలాంటి కష్టం వచ్చినా తాము అండగా నిలబడతామని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరలో ప్రజల్లోకి వస్తారని చెప్పారు. దేశానికి, రాష్ట్రానికి బీజేపీ చేసిందేమీ లేదన్నారు. బీజేపీ వచ్చాకే మనం బొట్టు పెట్టుకోవడం నేర్చుకున్నాం అన్నట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఐటీఐఆర్‌పై బండి సంజయ్ ఒక్క మాట మాట్లాడలేదని, తెలంగాణ కోసం

# పరమాత్మ అవతారంగా మోడీ ఫీల్

- తనకుతానుగా విష్ణుమూర్తి 11వ అవతారంగా భావన
- మోడీ నిరంకుశ తీరుపై మండిపడ్డ మల్లికార్జున ఖర్గే

**డెహ్రాడూన్,జనవరి29(మరో ఉదయం):**



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తనను తాను విష్ణుమూర్తి 11వ అవతారంగా అనుకుంటున్నారని, మతాన్ని రాజకీయాలతో ముడిపెడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నిశిత విమర్శలు చేశారు. ప్రజలు ఉదయం లేవగానే దేవీదేవతలు, గురువుల ముఖాలు చూడడానికి బదులు తన ముఖమే చూడాలని ప్రధాని కోరుకుంటున్నారని అన్నారు. డెహ్రాడూన్‌లోని బన్నూ స్కూల్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఖర్గే మాట్లాడుతూ, విష్ణుమూర్తి దశావతారులు గురించి అందరికీ తెలుసునని, ప్రధాని ఇప్పుడు విష్ణువు 11వ అవతారంగా అనిపించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. మతపరమైన సెంటిమెంట్లను ఉపయోగించుకుని ఈఏడాది లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలనుకుంటున్న బీజేపీని తిప్పికొట్టాలని ప్రజలను కోరారు. మతాన్ని రాజకీయాలతో ముడిపెడితే మంచి, చెడులను నిర్వచనం చాలా కష్టమవుతుందన్నారు.

# ఇండియా కూటమిలో అప్పుడే బీటలు

### బిజెపి శక్తివందన్ వర్క్‌షాపులో కిషన్ రెడ్డి

**హైదరాబాద్,జనవరి29(మరో ఉదయం):**



విపక్షాలు పెట్టుకున్న ఇండియా కూటమి అప్పుడే విచ్ఛిన్నం అవుతోందని కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నాడు శక్తి వందన్ వర్క్ షాప్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, మహిళా రుణాలు, ముద్రా యోజన లోన్లపై అవగాహన కల్పించారు. ఒక్కో జిల్లా నుంచి 15మంది ప్రతినిధులను బీజేపీ నాయకత్వం నియమించింది. ఈ కార్యక్రమానికి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో అనేక కుంభకోణాలు జరిగాయని.. ఆ కుంభకోణాల వల్లే అధికారానికి దూరం అయిందని విమర్శించారు. కాంగ్రెస్ అవినీతిపై విసిగి పోయిన ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని తెలిపారు. సమర్థవంతంగా కరోనాను మోదీ ఆధ్వర్యంలో ఎదుర్కొన్నామని చెప్పారు. స్వయంగా ప్రధాని వచ్చి వ్యాక్సిన్ తయారు చేసే కంపెనీలను సందర్శించి వారికి ధైర్యం ఇచ్చారన్నారు. మోదీని విమర్శించే ధైర్యం విపక్షాలకు లేదన్నారు. ఏదో ఓ రకంగా మోదీపై కొన్ని పార్టీల్లోని నేతలు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి అవినీతి లేకుండా మోదీ పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాలలో కనీసం రోడ్లు కూడా ఉండేవి కావని.. ఇప్పుడు పెద్ద ఎత్తున జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు.

# రాష్ట్ర ప్రజల హక్కుల కోసం పోరాడుతా

- ముఖ్యమంత్రి అయ్యాక మారిన జగన్
- వైకాపా కోసం పనిచేస్తే తనపైనే దాడులా
- బిజెపికి అండగా ఉన్నా ప్రాజెక్టులు ఎందుకు రాలేదు
- వైఎస్ మార్క్ అభివృద్ధికి దూరంగా జగన్ పాలన
- సాక్షిలో నాకూ సమాన వాటా ఉంది
- కడప కార్యకర్తల సమావేశంలో షర్మిల ఘాటు విమర్శలు

**కడప,జనవరి29(మరో ఉదయం):**


2లో

# గూడూరులో స్వల్ప ఉద్రిక్తత


2లో

- వార్డు సభ్యుడిగా గెలవలేనోడు విమర్శిస్తాడా
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- మంత్రి తీరుపై హరీష్ రావు ఆగ్రహం

**భువనగిరి,జనవరి29(మరో ఉదయం):**

మరో ఉదయం TELUGU DAILY & NEWS CHANNEL

మొదటిపేజీ తరువాయి

# గూడూరులో స్వల్ప ఉద్రిక్తత

గ్రామపంచాయతీ సాక్షిగా మంత్రి, జడ్పీ చైర్మన్ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. ఒకరినొకరు పరస్పరం విమర్శలు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. యదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రితో పాటు ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా సందీప్ రెడ్డి మాట్లాడుతూ నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నిధులతో నిర్మించిన భవనాలను ప్రారంభించడమే కాకుండా బీఆర్ఎస్ పై బురద జల్లడం సరికాదన్నారు. రైతుబంధు అడిగినోళ్లను చెప్పుతో కొట్టాలని మంత్రి అనడం మంచి పద్ధతి కాదని సూచించారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి వెంటనే లేచి మాజీ మంత్రి మాధవరెడ్డి మహానీయుడని, ఆయన కొడుకు బచ్చా అంటూ.. కనీసం వార్డు సభ్యుడిగా కూడా గెలవలేనోడు తనను విమర్శించడం హాస్యాస్పదం అని అన్నారు. వెంటనే ఆయనను బయటకు పంపాలని పోలీసులను మంత్రి ఆదేశించారు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వావాదం చోటు చేసుకుంది. ఇంతలోనే కాంగ్రెస్ శ్రేణులు స్టేజీపైకి వచ్చి హంగామా సృష్టించి ఒక్కసారిగా జడ్పీ చైర్మన్ పైకి దూసుకెళ్లారు. దీంతో జడ్పీ చైర్మన్ ను పోలీసులు,బీఆర్ఎస్ శ్రేణులు అక్కడి నుంచి పక్కకు తీసుకెళ్లారు. యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డిపై కాంగ్రెస్ నేతల దౌర్జన్యాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఖండించారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో సాటి ప్రజాప్రతినిధులను అవమానపరుస్తున్న మంత్రుల వైఖరి గర్హనీయమని హరీశ్‌రావు అన్నారు. మొన్న రైతుబంధు రాలేదన్న వారిని చెప్పుతో కొట్టండి అని పిలుపునిచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. నేడు అధికారిక కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్‌ను అకారణంగా దుర్భాషలాడటం కాంగ్రెస్ నియంతృత్వ పోకడలకు నిదర్శనమని విమర్శించారు. దుర్భాషలాడింది చాలదన్నట్టు.. పోలీసులకు హుకుం జారీ చేసి బలవంతంగా సందీప్ రెడ్డిని బయటకు పంపిన తీరును ఖండిస్తున్నా అని హరీశ్‌రావు అన్నారు. ప్రజాస్వామ్య వాదులంతా కోమటిరెడ్డి పోకడలను తీవ్రంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం నమ్మకం ఉన్నా.. జడ్పీచైర్మన్‌కు తక్షణమే క్షమాపణ చెప్పాలని మంత్రి కోమటిరెడ్డిని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

మొదటిపేజీ తరువాయి

# రాష్ట్ర ప్రజల హక్కుల కోసం పోరాడుతా

జగన్ ముఖ్యమంత్రి అయ్యాక పూర్తిగా మారిపోయారని ఏపీసీసీ అధ్యక్షురాలు, ఆయన సోదరి వైఎస్ షర్మిల ఆరోపించారు. వైకాపా కోసం నిస్వార్థంగా పని చేస్తే.. ఇప్పుడు తనపైనే వ్యక్తిగత దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కడపలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. తనకు ఎప్పుడూ పదవీ కాంక్ష లేదని, ఎన్ని అవరోధాలు కల్పించినా రాష్ట్ర ప్రజల హక్కుల కోసం పోరాటం సాగిస్తానని స్పష్టం చేశారు. 'వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా తన మార్క్ రాజకీయం, సంక్షేమ పాలన అందించారు. అదిప్పుడు జగనన్న పాలనలో ఎక్కడ ఉంది. వైకాపాని అధికారంలోకి తీసుకొచ్చేందుకు 3,200 కి.మీ పాదయాత్ర చేశా. అలాంటిది ఇప్పుడు నాపైన మూకుమ్మడిగా దాడి చేస్తున్నారు. రోజుకొకరితో నాపై వ్యక్తిగతంగా దూషణలు చేయిస్తున్నారు. ప్రణబ్ ముఖర్జీతో నా భర్త అనిల్ కలిసి రాజకీయం చేశారని మాట్లాడుతున్నారు. జగన్‌ను జైల్లో పెట్టి నేను ముఖ్యమంత్రి కావాలని బ్రదర్ అనిల్ కోరినట్లు విష ప్రచారం చేస్తున్నారు. అదంతా అబద్ధం' 'సోనియా గాంధీ దగ్గరికి అనిల్.. భారతి రెడ్డితో కలిసే వెళ్లేవారు. వైకాపా నేతలకు దమ్ముంటే ప్రణబ్ ముఖర్జీ కుమారుడిని అడిగి తెలుసుకోండి. జగన్ పత్రికలో నా పైన వ్యక్తిగతంగా వార్తలు రాయిస్తున్నారు. ఆ పత్రికలో జగన్‌కు ఎంత భాగస్వామ్యం ఉందో నాకూ అంతే ఉంది. ఆ విషయం మరిచి ఆ పత్రిక ఇష్టానుసారం వార్తలు రాస్తోంది. వైకాపా నాయకులు ఏం రాసినా, ఏం చేసినా భయపడే ప్రసక్తే లేదు. ఏం చేసుకుంటారో చేసుకోండని షర్మిల తీవ్రంగా మండిపడ్డారు. రోజుకో బాంబు పేలుస్తూ వైసీపీకి సమస్యగా మారిన ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల మరో బాణం వదిలారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడిన జగన్ మీడియా అయిన సాక్షిలో తనకూ భాగం ఉందంటూ ప్రకటించారు. తనపై రోజుకో జోకర్‌ను తీసుకొచ్చి విమర్శలు చేయిస్తున్నారని మండిపడ్డారు. తనపై ఎన్ని నిందలు వేసినా తాను మాత్రం వైఎస్ షర్మిలా రెడ్డినే అన్నారు. తెలంగాణలో తనతో కలిసి పని చేసిన వాళ్లకు సాక్షి సంస్థ ఫోన్లు చేస్తుందని... తనపై వ్యతిరేకంగా మాట్లాడాలని అడుగుతున్నారన్నారు షర్మిల. అదే సాక్షి సంస్థలో తనకూ భాగం ఉందన్నారు. వైఎస్సారే తనకు సగం భాగం ఇచ్చారని చెప్పారు. సగం భాగం ఉన్నా నాపై నా సంస్థ బురద చల్లుతుందని ఆవేదన చెందారు. తాను ప్రజల సమస్యల మాట్లాడుతున్నానని.. హామీల వైఫల్యాల మీద మాట్లాడుతున్నానని చెప్పారు. విలువలు ,విశ్వసనీయత లేకుండా దిగజారుతున్నారని అన్నారు. తండ్రి వైఎస్ రక్తమే తనలో ఉందన్నారు షర్మిల. పులి కడుపున పులే పుడతుందని చెప్పుచొక్కారు. ఏపీ తన పుట్టినిల్లు అన్న షర్మిల... అందుకే ఇక్కడ రాజకీయాలు చేయడానికి వచ్చానంటూ చెప్పుకొచ్చారు. ఏం పీక్కుంటారో పీక్కోండని... ఎన్ని నిందలు వేస్తారో వేసుకోండని సవాల్ చేశారు. ఎడుగూరి సందింటి రాజశేఖర్ రెడ్డి ఈ కడప బిడ్డ. పులివెందుల పులి అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన షర్మిల తర్వాత వైసీపీ టా÷–గ్గ÷ట్‌గా డోసు పెంచారు. తెల్లని పంచే కట్టు మొహం నిండా చిరునవ్వుతో నేటికీ తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారన్నారు. వైఎస్సార్ పథకాలతో ముఖ్యమంత్రి అంటే ఇలా పని చేయాలని నిరూపించారన్నారు. వైఎస్సార్ పథకాలు పొందని గడపే లేదని అభిప్రాయపడ్డారు షర్మిల. పార్టీలకు అతీతంగా అందరూ ఆయన పథకాలు పొందారన్నారు. అలాంటి మార్క్ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా వైఎస్ ఆర్ ఉండేవారని అన్నారు వైఎస్ షర్మిలా రెడ్డి. ఆయన పథకాలే ఒక మార్క్ అని చెప్పుకచ్చారు షర్మిల. రైతులకు రుణమాఫీ వైఎస్సార్ మార్క్, 50 లక్షల మంది బిడ్డలకు ఫీజు రీయింబర్స్మెంట్ వైఎస్సార్ మార్క్. 46 లక్షల పేదలకు పక్కా ఇళ్లు కట్టడం వైఎస్సార్ మార్క్ అంటూ పథకాలు పేర్లను వివరించారు. మాట తప్పడం మడమ తిప్పడం వైఎస్సార్ కి చేతకాదని అన్నారు షర్మిల. తనకు మేలు చేస్తే..జీవితాంతం గుర్తు పెట్టుకోవడం వైఎస్సార్ మార్క్ అన్నారు. తన అనుకున్న వాళ్లకు ప్రాణం సైతం ఇవ్వడం వైఎస్సార్ మార్క్. నమ్మిన వాళ్ళను మనసులో ఎప్పటికీ ఉంచుకోవడం వైఎస్సార్ మార్క్. ప్రజలకు అందుబాటులో ఉండటం వైఎస్సార్ మార్క్, పథకాలు అందుతున్నాయో లేదో చూడటం వైఎస్సార్ మార్క్ అంటూ వివరించారు. వైఎస్ బతికే ఉంటే కడప స్టీల్ వచ్చేదన్నారు. అదే పూర్తై ఉంటే కచ్చితంగా 20 వేల మందికి ఉద్యోగాలు వచ్చేవి అన్నారు. లక్ష మందికి పరోక్షంగా ఉపాధి దొరికేది అని అభిప్రాయపడ్డారు. నేటి పాలకుల కారణంగా కడప స్టీల్ ఒక కల గానే మిగిలిపోయిందని విమర్శించారు షర్మిల. కాంగ్రెస్ పార్టీ కడప స్టీల్ ప్రాజెక్ట్ ను విభజన హామీల్లో పెట్టిందని గుర్తు చేశారు. చంద్రబాబు 18 వేల కోట్లతో మళ్ళీ శంకుస్థాపన చేశారని... 5 ఏళ్లలో నిర్లక్ష్యం చేశారన్నారు. ఆ టైంలో జగన్ దీక్షలు కూడా చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి అయ్యాక రెండు సార్లు శంకుస్థాపన చేశారని వివరించారు. కడప స్టీల్ ను శంకుస్థాపన ప్రాజెక్ట్ గా మార్చారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ హయాంలో కడప నుంచి బెంగళూర్ వరకు రైల్వే లైన్ అనుమతి తెచ్చారని వివరించారు. కేంద్రంతో మాట్లాడి ప్రాజెక్ట్‌కు నిధులు కూడా తెచ్చారన్నారు. 25 కిలేమేటర్ల వరకు నిర్మాణం జరిగిందని... ఎస్సార్ మరణం తర్వాత ఈ ప్రాజెక్ట్ పట్టించుకునే వాళ్లే లేరన్నారు. జగన్ హయాంలో ఆ రైల్వే లైన్ అవసరం లేదని లేఖ రాశారని ఆరోపించారు. ఒక చిన్న లైన్ చాలని సర్దుకున్నారని విమర్శించారు. మట్టి బిందెను తీసుకొని బంగారు బిందె ఇచ్చినట్లు ఉందని ఎద్దేవా చేశారు. . మోడీతో దోస్తీ చేసే మీరు ఎందుకు ఈ ప్రాజెక్టులను తేలేక పోయారని ప్రశ్నించారు షర్మిల. అన్నమయ్య ప్రాజెక్ట్ కొట్టుకు పోతే ఇంత వరకు మరమ్మత్తులు లేవన్నారు. రోడ్డున పడ్డ కుటుంబాలను పట్టించుకోలేదని ఆరోపించారు. వైఎస్సార్ తన జీవితంలో బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించారని... అలాంటి వ్యక్తి ఆశయాలను జగన్ నిలబెడుతున్నరా ? అని ప్రశ్నించారు. వైఎస్సార్ మైనారిటీలను ప్రేమించే వారు... ఇప్పుడు జగన్ మైనారిటీలపై బీజేపీ దాడులు చేస్తుంటే స్పందించడం లేదని విమర్శించారు షర్మిల. వైఎస్సార్ ఆశయాలను కొనసాగించలేనీ మీరు వైఎస్సార్ వారసులు ఎలా అవుతారని నిలదీశారు. బీజేపీని అడిగే శక్తి లేదు. నిలదీసే దమ్ము కూడా లేదని తూర్పారబట్టారు. పోలవరం అడిగే సత్తా లేదు...హోదా కోసం కొట్లాడే పరిస్థితి లేదన్నారు. దేశంలో బీజేపీ వేరే అర్థం ఉంటే ఇక్కడ మాత్రం బాబు, జగన్, పవన్ అని విమర్శలు చేశారు. ఈ ఎన్నికల్లో మన జాతకాలు మారాలని పిలుపునిచ్చారు. కడప నా పుట్టిన ఇల్లని చెప్పుకొచ్చిన షర్మిల. జగన్ ఎలా పుట్టారో తను కూడా అలానే పుట్టానన్నారు. జమ్మల మడుగు ఆసుపత్రిలో పుట్టినట్టు చెప్పుకొచ్చారు. జగన్‌కు నేను వ్యతిరేకి కాదన్నారు షర్మిల. ఇద్దరిదీ ఒకటే రక్తం అన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మారిపోయారని ఆరోపించారు. ఇప్పుడున్న జగన్‌ను ఎప్పుడు చూడలేదన్నారు. ఆయనకు క్యాడర్‌కి, పార్టీకి తాను చేసిన సేవలు గుర్తు లేవన్నారు. తనపైనే స్టోరీలు అల్లుతున్నారని ఆవేదన చెందారు. రోజుకో జోకర్‌ను తీసుకొచ్చి బురదజల్లుతున్నారని ధ్వజమెత్తారు. కొత్తగా వచ్చిన జోకర్ ప్రణబ్ ముఖర్జీ పేరు ప్రస్తావించారని తన భర్త వెళ్లి అనిల్‌ను కలిసినట్టు విమర్శలు చేస్తున్నారని అన్నారు షర్మిల. జగన్‌ను బయటకు రానివ్వద్దు లాబియింగ్ చేశామని కొత్త పుకార్లు సృష్టిస్తున్నరన్నారు. సాక్ష్యం చెప్పడానికి ప్రణబ్ లేరనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. వీళ్ల కుట్రలకు అంతే లేదన్నారు. తనకు పదవి ఆకాంక్ష ఉంటే నాన్నను అడిగి తీసుకోనా అని ప్రశ్నించారు. వైసీపీలోనైనా పదవి తీసుకోనా అని చెప్పుకొచ్చారు. అప్పుడు అనిల్, భారతి రెడ్డితో కలిసి సోనియా వద్దకు వెళ్ళారు... మరి ఆమెకు తెలియకుండా ఎలా అడిగారని ప్రశ్నించారు.

# గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- ఆశాస్త్రీయంగా గ్రామపంచాయతీల ఏర్పాటు..!
- మనది కాంగ్రెస్ ప్రజాస్వామ్య ప్రభుత్వం
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- గుంజల్ పహాడ్ గ్రామంలో అంగన్వాడి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్ జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 28 :**

పరిపాలన సౌలభ్యం పేరిట గ్రామపంచాయతీలను ఆశాస్త్రీయంగా ఏర్పాటు చేశారని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తీరుపట్ల ఆక్షేపనలు వ్యక్తం చేశారు. ఆదివారం నియోజకవర్గంలోని చౌదరిగుడ మండలం గుంజల్ పహాడ్ గ్రామంలో ప్రభుత్వ నిధులతో అంగన్వాడి భవనాన్ని రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ప్రారంభోత్సవం చేశారు. అంతకు ముందు ఫరుక్ నగర్ మండలం మొండొనిరాయి తాండ గ్రామంలో గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ఏర్పాటును అశాస్త్రీయంగా గత ప్రభుత్వం చేపట్టిందని విమర్శలు వ్యక్తం చేశారు. పరిపాలన సౌలభ్యం పేరిట ఆమోదయోగ్యముగా లేని కొన్ని గ్రామాలను గ్రామ పంచాయతీగా చేశారని అవసరమైన చోట వదిలేసారని ఈ సందర్భంగా అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వాలు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆయన చిన్న కుమారుడు చెప్పిన విధంగా చిట్టీలు రాసిస్తే గ్రామపంచాయతీలు ఏర్పాటు చేశారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య ప్రభుత్వం అని ప్రజల అవసరాలకు అనుగుణంగా పరిపాలి స్తుందని ఈ సందర్భంగా అన్నారు. ప్రజలు బాధ్యతాయుతంగా కట్టబెట్టిన పదవులను జాగ్రత్తగా వాడుకోవాలని, ప్రజలకు వ్యతిరేకంగా ఏ పని చేయకూడదని అన్నారు. జెడ్పి చైర్పర్సన్ తీగల అనిత రెడ్డి మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమం కోసం ప్రభుత్వ కృషి చేస్తుందని ఆమె అన్నారు. చిన్నారులను మహిళలకు పౌష్టికాహారం అందించే విధంగా శిశు సంక్షేమ శాఖ అధికారులు పనిచేయాలని ఇక్కడ సంబంధిత అధికారిని నాగమణి తన శాఖ ద్వారా మంచి ఉత్సాహంగా పనిచేస్తున్నట్టు తనకు తెలుస్తుందని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ నాగమణి, చైర్మన్ చిట్టెం దామోదర రెడ్డి, జెడ్పిటిసి వెంకటరామిరెడ్డి, స్థానిక ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు..



# నిజం మాట్లాడిన అందుకే అరుణమ్మ ముఖం చాటేసింది

## మీడియాతో మాట్లాడిన షాద్ నగర్ యూత్ కాంగ్రెస్ నాయకులు

**రంగారెడ్డి జిల్లా జనవరి 28 :మరో ఉదయం**

2019 లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాజీ మంత్రి డికె అరుణ కాంగ్రెస్ పార్టీ సమావేశంలో 15 కోట్ల రూపాయలు ఇస్తేనే పోటీ చేస్తానని డిమాండ్ చేసిందని సిడబ్ల్యూసి ప్రత్యేక అహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి చేసిన ఆరోపణల నేపథ్యంలో ఏదైనా రామాలయంలో బహిరంగ ప్రమాణానికి సిద్ధమని ఇరువురి మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు జరిగాయి. ఈ మేరకు జనవరి 28, ఆదివారం చల్లా వంశీచంద్ రెడ్డి చెప్పిన సమయం కంటే ముందుగానే కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పట్టణంలోని రామాలయ దేవస్థానానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సవాల్‌కు సిద్ధమన్న డికె అరుణ కోసం ఎదురుచూశారు.చివరికి ఆమె రాకపోవడంతో స్థానిక విలేకరులతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహబూబ్‌నగర్,మక్తల్ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరిలతో కలిసి చల్లా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ..ధర్మానికి, నీతికి, నిజాయితీకి నిలువెత్తు రూపం శ్రీరాముడని, అలాంటి ఈ పుణ్యక్షేత్రం వేదికగా తాను చెప్పింది నిజం కాబట్టే..సవాల్ స్వీకరించకుండా డికె అరుణ తోక ముడిచి ముఖం చాటేసారని ఆరోపించారు. ఇప్పటికైనా ఆధారాలతో కూడిన ఆరోపణలు చేయాలే తప్పా అసత్య ప్రచారాలు మానుకోవాలని, లేని పక్షంలో ప్రజల్లో ఇలాగే భంగపాటు తప్పదని వంశీ చంద్ రెడ్డి హితవు పలికారు ఈ కార్యక్రమంలో

యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఖదీర్, యువజన కాంగ్రెస్ స్టేట్ సెక్రెటరీ అందే మోహన్ , పట్టణ అధ్యక్షుడు జఫర్, ఫరక్ నగర్ మండల అధ్యక్షుడు గణేష్, అందె శ్రీకాంత్, బచ్చలి నరేష్, హాలీం సాకీబ్, సతీష్,,వంశీ ,శీను, తదితరులు ఉన్నారు



# రాముడి సాక్షిగా డీకే అరుణ 15 కోట్లు డిమాండ్ చేసింది : చల్లా వంశీచంద్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 28 :–మరో ఉదయం**

రాముడి సాక్షిగా అప్పటి కాంగ్రెస్ నాయకురాలు డీకే అరుణ 2019 పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మహబూబ్ నగర్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసేందుకు 15 కోట్లు రూపాయలను డిమాండ్ చేసిందని, కాంగ్రెస్ సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు,మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి రామాలయంలో ప్రమాణం చేశారు.ఈ సందర్భంగా ఆయన ఆదివారం మహబూబ్ నగర్ పట్టణలోని టీచర్స్ కాలనీలో గల రామాలయానికి వచ్చి డీకే అరుణ కోసం ఎదురు చూసి ప్రమాణం చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు.డీకే అరుణ పై తాను చేసిన సవాల్ ను ఆమె స్వీకరించిందని, ఆమె చెప్పిన విధంగా ఆమెకు అనుకూలమైన తేదీ,సమయానికే తాను ఉదయం 11 గంటలకే రామాలయానికి వచ్చానని, ఆమె రాలేదంటే, ఎందుకు రాలేదో పాలమూరు ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. నిజం ఎటువైపు ఉంది,నిజాయితీ ఎటువైపు ఉందో పాలమూరు ప్రజలు గమనించాలని అన్నారు. అవినీతి, విలువలు లేని రాజకీయాలు చేయాలని, నిజం ఎప్పుడూ విజయం వైపే ఉంటుందని ఆయన అన్నారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే లు యెన్నం శ్రీనివాసరెడ్డి, వాకిట శ్రీహరి, మారెపల్లి సురేందర్ రెడ్డి, ఎన్పీ వెంకటేష్, ఆనంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

## గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో 1969-71 బ్యాచ్ విద్యార్థుల గెట్ టూ గెదర్

## పాత జ్ఞాపకాలు మధుర స్మృతులు

**భద్రాద్రి జిల్లా బ్యూరో కర్నే బాబు జనవరి :29 మరో ఉదయం**

భద్రాచలం లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం. సోమవారం చినజియ్యర్ మఠం సమావేశ మందిరం నందు భద్రాచలం లో గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ లో 1969.71 ఇంటర్మీడియేట్ మొదటి బ్యాచ్ గా విద్యనభ్య సించిన పూర్వ విద్యార్థులు, విద్యార్థినిలు సమావేశమై పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకుని ఒకరినొకరు ఆలింగనాలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. చిన్న నాటి సంఘటనలు అప్పటి ఆటలు పాటలు గుర్తుచేసుకుని మరలా విద్యార్థులలా మారిపోయి సంతోషంగా రోజంతా గడిపారు. విద్యనభ్యశించిన జూనియర్ కాలేజిని సందర్శించి వారు చదివిన గదులలో కూర్చిన పాత స్మృతులను గుర్తు చేసుకొని ఆనందం గా గడిపారు. రోజు వారీ కార్యక్రమాలకు భిన్నంగా గడిపి అందరూ ఆత్మీయంగా సంతోషం గా తిరుగుప్రయాణమై నారు. ఈ కార్ర్యక్రమానికి ఆద్యంతం తానై నిర్వహించిన పూర్వ విద్యార్దులు రాష్ట్ర ప్రభుత్వ అవార్డ్ గ్రహీత లయన్ డాక్టర్. గోళ్ల భూపతి రావు, యార్లగడ్డ హనుమంత రావు లు , మిగతా మిత్రులు మల్లాది వెంకట రావు, కృష్ణ బాబు, వెంకటనరసయ, నాగభూషణం, సత్యనారాయణ రెడ్డి, ఆంజనేయ వర్మ, అప్పా రావు, రమణ రెడ్డి, కృష్ణ కుమార్ , సుబ్బారావు, శంకర్ రావు, శ్రీధర్, వర్మ, రాజు, రాంబాబు, ఉదయభా స్కర్, ప్రభాకర్, పటేల్, పద్మజ, శారద , వెంకటమ్మ, విజయలక్ష్మి, సీత, మిగతా మిత్రులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ ద్వారానే మహిళలకు సముచిత స్థానం..

## టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

**మరో ఉదయం ప్రతినిధి కూకట్పల్లి**

కాంగ్రెస్ పార్టీ ద్వారానే మహిళలకు సముచిత స్థానం లభించిందని కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి మహిళకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షురాలు రాజనొల్ల లక్ష్మి ఆధ్వర్యంలో మహిళా విభాగం సమావేశం గాజుల రామారంలోని విన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు, మేడ్చెల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లా పూర్ నియోజక వర్గ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనపుడు కాంగ్రెస్ పార్టీ కోసం భర్తలను, పిల్లల్ని వదిలి పెట్టి కాంగ్రెస్ నాయకులతో సమానంగా పోరాటం చేసి, కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి సోదరీమణులకి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోలో పేర్కొన్నట్లు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని త్వరలో 500 కు గ్యాస్ సిలెండర్ ను, అర్హులైన ప్రతి మహిళకు 2500 అందిస్తుందని అన్నారు. మహిళలకు సముచిత స్థానం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోని బ్లాక్, డివిజన్ ల మహిళా అధ్యక్షులు, నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# సత్యమేవ జయతే

## - పినపాక ప్రెస్ క్లబ్ (రి.65/2022)

## నూతన కార్యవర్గం ఎన్నిక

**భద్రాద్రి జిల్లా బ్యూరో కర్నె బాబు జనవరి : 28 మరో ఉదయం**

పినపాక మండలం సత్యమేవ జయతే ప్రెస్ క్లబ్ (రి.65/2022) నూతన కమిటీని ఆదివారం కరకగూడెం మండలం రాళ్ళవాగు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సామాజిక కార్యకర్త అడ్వకేట్ కర్నె రవి, పినపాక ఎంపీటీసీ చింతపంటి సత్యం , లాయర్ గొడుగునూరి. నాగార్జున రెడ్డి హాజరయ్యారు. నూతన అధ్యక్షులుగా గొడిశాల చంద్రం, ఉపాధ్యక్షులుగా యోగీశ్వర్ రావ్, ప్రధాన కార్యదర్శిగా తోకల శంకర్, సహాయ కార్యదర్శిగా కొంపెల్లి నాగేష్, ట్రెజరరీగా అందెం యాకన్న లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ.. ప్రెస్ క్లబ్ సభ్యుల సంక్షేమానికి నిరంతరం పోరాటం చేస్తామని, అధికారులతో కలిసి ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు నిట్ట వెంకటేశ్వర్లు, కొంపెల్లి సంతోష్, కన్నె రమేష్, కొంపెల్లి మల్లేష్, గుమసు వెంకటేశ్వర్లు, బోడ లక్ష్మణ్ రావ్, మొహమ్మద్ రియాజ్, దొడ్డా శ్రీనివాస్ రావ్, కోటి, రాజశేఖర్, మణుగూరు న్యాయవాది నాగార్జున రెడ్డి లు పాల్గొన్నారు.



# రైతులను చెప్పుతో కొడతామంటున్న కాంగ్రెస్‌ను

# ఓటుతో కొడదాం: కేటీఆర్

## దేశానికి, రాష్ట్రానికి బీజేపీ చేసిందేమీ లేదు : ఎంపి రంజిత్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా జనవరి 29 :**

పదేండ్లు కమిట్‌మెంట్‌తో పనిచేశామని.. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సర్కారును నడిపించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మూడోవంతు సీట్లను ఇచ్చి బలమైన ప్రతిపక్షంగా పనిచేయమని ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదేశించారని చెప్పారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్పు అనే పేరుతో అమాయకులైన యువతను కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. ఆరున్నర లక్షల మంది ఆటో డ్రైవర్లను సర్కారు గోసపెడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఎక్కడా 24 గంటల కరెంటు రావడం లేదని చెప్పారు.రైతుబంధు అడిగితే చెప్పుతీసి కొడతామని అంటున్నారని విమర్శించారు. రైతుభరోసా ఇచ్చామంటూ అంతర్జాతీయ వేదికలపై అబద్ధం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులను చెప్పుతో కొడతామంటున్న కాంగ్రెస్‌ను ఓటుతో కొడదామన్నారు. అధికారంలో వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణం మాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి చెప్పారని, ఇప్పటికీ అది అమలుకాలేదని చెప్పారు. రుణం తెచ్చుకున్న రైతులకు మొండి చేయి చూపించారని విమర్శించారు. డిసెంబర్ 9న రుణమాఫీ ఫైలుపై సంతకం చేస్తామని రేవంత్ చెప్పారని గుర్తుచేశారు. తాము ప్రభుత్వంలో ఉన్నామనే విషయాన్ని కాంగ్రెస్ మర్చిపోయినట్లుందని ఎద్దేవాచేశారు.కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఎప్పటి నుంచి ఇస్తారని ప్రశ్నించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ ప్రసంగం సామాన్య కాంగ్రెస్ కార్యకర్త ప్రసంగం కంటే హీనంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలిచ్చిందని, ఆ హామీలను అమలు చేయకుంటే బట్టలిప్పి నిలబెడతామన్నారు. నోటికొచ్చిన హామీలిచ్చి ఇరుక్కుపోయారని విమర్శించారు. కాంగ్రెస్ ఐదేండ్లు అధికారం నిలుపుకుంటుందా.. లేదా వేచి చూద్దామన్నారు. పార్లమెంటు ఎన్నిల కోడ్ రాకముందే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ బెదిరింపులకు బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దని సూచించారు. ఎలాంటి కష్టం వచ్చినా తాము అండగా నిలబడతామని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరలో ప్రజల్లోకి వస్తారని చెప్పారు. దేశానికి, రాష్ట్రానికి బీజేపీ చేసిందేమీ లేదన్నారు. బీజేపీ వచ్చాకే మనం బొట్టు పెట్టుకోవడం నేర్చుకున్నాం అన్నట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఐటీఐఆర్‌పై బండి సంజయ్ ఒక్క మాట మాట్లాడలేదని, తెలంగాణ కోసం పార్లమెంటులో మాట్లాడేది బీఆర్ఎస్ నాయకులు మాత్రమేనని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎంపి రంజిత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కరెంట్ విషయంలో విఫలమైంది. దేశానికి, రాష్ట్రానికి బీజేపీ చేసిందేమీ లేదన్నారు.అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా బిఆర్ఎస్ సర్కారు పనిచేసింది అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, బిఅర్ఎస్ యువ నాయకులు కార్తిక్ రెడ్డి, జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి,మాలతి కృష్ణారెడ్డి,ఎంపీపీ దర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి,బిఅర్ఎస్ మహిళ నాయకురాలు స్వప్న ,బిఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ పెద్దోళ్ల ప్రభాకర్, నర్సింగ్ రావు, మహేందర్ రెడ్డి,మంగలి బల్ రాజ్,యాదగిరి, ఎంపీటీసీ,సర్పంచ్,వార్డ్ నంబర్లు, బిఆర్ఎస్ నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ఎంపీడీవో కార్యాలయంలో వివిధ నూతనీకరణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 29 :**

షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండల పరిషత్ కార్యాలయంలో వివిధ నోతనీకరణ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. సోమవారము సర్వసభ్య సమావేశానికి హాజరైన సందర్భంలో ఎంపీడీవో కార్యాలయంలో వివిధ నూతనీకరణ పనులను జడ్పీటిసి పి. వెంకట్ రాంరెడ్డి, ఎంపిపి ఖాజా అహ్మద్ ఇద్రీస్, సింగిల్ విండో చైర్మన్ బక్కన్న యాదవ్, ఎంపీడీవో వినయ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మదురాపురం ఎంపిటిసి భార్గవ్ కుమార్ రెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు..




# అధికారులు దాతల ఫోటోలు వేయకుండా పాఠశాల బావనాలను ప్రారంభించడం విడ్డూరం... ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్పల్లిమరో ఉదయం**

కూకట్పల్లిలో శిధిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను తొలగించి దాతలు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ సహాయంతో నూతన పాఠశాల భవనాలను నిర్మిస్తే అధికారులు మాత్రం కనీసం దాతల ఫోటోలను వేయకుండా ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు.కూకట్పల్లి మండల ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలను నూతనంగా నిర్మించిన పాఠశాల భవనం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 44 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని వాటిలో కొన్ని పాఠశాలలు శిథిలవస్థలో ఉన్నాయని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా రాజీవ్ గాంధీ నగర్లో మరియు కూకట్పల్లిలో దాతలు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ సహాయంతో వారి తాతయ్య అమ్మమ్మ మాధవరం రామచంద్రరావు మాధవరం సుశీలమ్మ స్మారకంగా రెండు పాఠశాల భవనాలను నిర్మించారన్నారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను దాతల సహాయంతో నూతన భవనాలను నిర్మిస్తామని ప్రభుత్వాలు మారిన కూకట్పల్లిలో అభివృద్ధి ఆగదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. దాతల సహాయంతో పాఠశాల భవనాలను కట్టిస్తే అధికారులు మాత్రం కనీసం ప్రోటోకాల్ కూడా పాటించడం లేదని దాతల ఫోటోలు లేకుండా ప్రోటోకాల్ లేకుండా పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు జరుగుతే రాబోయే రోజుల్లో మంచి కార్యక్రమాలు చేయడానికి దాతలు కూడా ఎవరూ ముందుకురారని దానిని అధికారులు గ్రహించి మరలా పునావృత్తం కాకుండా చూడాలని అధికారులకు సూచనలు చేశారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలంటే విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించేవారు కాదని, కానీ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వ పాఠశాలలపై పెట్టిన దృష్టితోనే ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ విద్యార్థులు చేరుతున్నారని దానిని ప్రస్తుత ప్రభుత్వం ఆదర్శంగా తీసుకొని మరింత అభివృద్ధి చేయాలని అన్నారు.పాఠశాల భవన నిర్మాణాన్ని ఏర్పాటుచేసిన దాతలు కొండలరావు మరియు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో విజయ కుమారి, ఎంఈఓ ఆంజనేయులు, కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నరసింహ యాదవ్, సతీష్ గౌడ్, సబిహా గౌసుద్దిన్,రవీందర్ రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# కూకట్పల్లి బిఆర్ఎస్ శ్రేణులతో ఎమ్మెల్యే కృష్ణారావు సమీక్ష సమావేశం..

**మరో ఉదయం ప్రతినిధి కూకట్పల్లి**

కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కార్పొరేటర్లు ,డివిజన్ అధ్యక్షులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 3వ తేదీన కూకట్పల్లిలోని ఎన్ కే ఎన్ ఆర్ గార్డెన్లో జరగబోయే కార్యకర్తల సమావేశానికి బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచ్చేస్తున్న నేపద్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని ప్రభుత్వాలు మారిన పార్టీ శ్రేణులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని అలాగే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో వ్యవహరించాల్సిన సూచనలను కేటీఆర్ 3వ తేదీ సమావేశంలో వివరిస్తారని కావున ఈ సమావేశానికి పార్టీ కార్యకర్తలు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కూకట్పల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, మహేశ్వరి శ్రీహరి, జూపల్లి సత్యనారాయణ, సబియా గౌసుద్దీన్ , మాజీ కార్పొరేటర్లు తూము శ్రవణ్ కుమార్, పగడాల బాబురావు తదితరులు పాల్గొన్నారు.



# జగద్గిరిగుట్ట సగర సంగం నూతన కార్యవర్గం నియామకం

**మరో ఉదయం ప్రతినిధి శేర్లింగంపల్లి**

జగద్గిరిగుట్ట సగర సంగం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఏ. కొండయ్య సాగర్, ప్రధాన కార్యదర్శిగా అస్కానీ శ్రీనివాస్ సాగర్, కోశాధికారిగా కొమ్ముల రాజేష్ సాగర్, స్టీరింగ్ కమిటీ చైర్మన్గా కె.పి.రాంసాగర్, వైస్ చైర్మన్ గా ఎం రాములు సాగర్, స్టీరింగ్ కమిటీ సభ్యులుగా ఏ శ్రీనివాస్ సాగర్, కె.పి రాములు సాగర్, ఏ వెంకట స్వామి సాగర్, ఏ మారుతి సాగర్, బంగారి నరసింహసాగర్, ఆర్కే దయాసాగర్, సిహెచ్ శ్రీనివాస్ సాగర్, డి గోపాల్ సాగర్, గౌరవ సలహాదారులుగా డి శ్రీరాములు సాగర్, సంగిశెట్టి గంగాధర్ సాగర్, ఎన్ రామకృష్ణ సాగర్, కే వెంకటేష్ సాగర్, ఉపాధ్యక్షులుగా ఎన్ చంద్రశేఖర్ సాగర్, వేముల సుదర్శన్ సాగర్, ఎం కృష్ణ సాగర్, ఎంఎస్ భీమయ్య సాగర్, జి ఆంజనేయులు సాగర్, ఎం వెంకటకృష్ణ సాగర్, కే సురేష్ సాగర్, కె.పి శివసాగర్, స%శీ%యుక్త కార్యదర్శులుగా ఎం బాలరాజు సాగర్, గడ్డమీది రవి సాగర్, ఎన్ సుభాష్ సాగర్, ఉప కోశాధికారులుగా ఆర్ చంద్రమోహన్ సాగర్, కె శేఖర్ సాగర్, జి కృష్ణ సాగర్, ఎం వెంకటకృష్ణ సాగర్, మీడియా కన్వీనర్లుగా సిహెచ్ శ్రీనివాస్ సాగర్ కార్యనిర్వాక కార్యదర్శిలుగా ఎస్ విష్ణు సాగర్, ఎం ఆంజనేయులు సాగర్, కే ఆంజనేయులు సాగర్, కేపీ చిరంజీవి సాగర్, ప్రచార కార్యదర్శిగా వి ప్రభాకర్ సాగర్, ఎం రాములు సాగర్, ఏ శ్రీనివాస్ సాగర్, ఎమ్మెస్ శ్రీనివాస్ సాగర్, కార్యవర్గ సభ్యులుగా ఏ రవి సాగర్, జి రాము సాగర్, జి శేఖర్ సాగర్, ఆఫీస్ బాయ్ డి రంగయ్య సాగర్ లు నియమితులయ్యారు.










# జోనల్ కమిషనర్ అభినవ్ అభిలాషను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కార్పొరేటర్లు..

**మరో ఉదయం ప్రతినిధి శేర్లింగంపల్లి**

కూకట్పల్లి జోనల్ కమిషనర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్ ఐ.ఏ.ఎస్ ని శేర్లింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి రంగరావు, దొడ్ల వెంకటేష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగరావులతో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని వివేకానంద నగర్, ఆల్విన్ కాలనీ,హైదర్ నగర్, కూకట్పల్లి (పార్ట్) డివిజన్ల అభివృద్ధి పనుల పై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని వివేకానంద నగర్, ఆల్విన్ కాలనీ,హైదర్ నగర్, కూకట్పల్లి (పార్ట్) డివిజన్ల లో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడలని కోరారు. గతంలో అభివృద్ధి పనులకు నెలకు డివిజన్ల వారిగా 8 కోట్లు విడుదల అయ్యేవి అని ,ఇప్పుడు 4 కోట్లు మాత్రమే మంజూరు అవుతున్నాయని, అవి కూడా సకాలంలో రాలేకపోతున్నాయని, సకాలంలో మంజూరు అయ్యేలా చూడలని , అభివృద్ధి పనులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, వర్షాలకు గుంతలు పడితే పూడ్చలేని పరిస్థితి నెలకొందన్నారు. అదేవిధంగా చెరువుల సుందరికరణ, పార్క్ లు అభివృద్ధి చేపట్టాలని, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, అభివృద్ధి విషయంలో అధికారులతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు.దీనిపై జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఐ.ఏ.ఎస్ సానుకూలంగా స్పందించి అభివృద్ధి పనుల విషయంలో తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.



# అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత

**భద్రాద్రి జిల్లా బ్యూరో కర్నె బాబు జనవరి : 28 మరో ఉదయం**

మణుగూరు లోఎక్సై జ్ ఇన్‌స్పెక్టర్ సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టగా ఆ తనిఖీల్లో భారీగా గంజాయిని పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి 11 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గంజాయి తరలింపుకు ఉపయోగించిన కారును సీజ్ చేశామని తెలియజేశారు. గంజాయిని మల్కాజ్గిరి నుండి దూల్పేట తరలిస్తున్నట్లుగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ ఖరీం,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు




# తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించిన డా. మల్లు రవికి అభినందనల వెల్లువ....

## మర్యాదపూర్వకంగా కలిసిన శేరి సతీష్ రెడ్డి

**మరో ఉదయం న్యూస్ కూకట్పల్లి**

తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన డా. మల్లు రవి కి కూకట్పల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కూకట్పల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేరి సతీష్ రెడ్డి శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్టానికి రాజ్యాంగ బద్దంగా రావలిసిన హక్కుల గురించి మల్లు రవి నేతృత్వంలో చర్చలు జరిపి రాష్ట్ర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.




# మరింత చురకుగా సమంత

అగ్ర నటీమణుల్లో ఒకరైన సమంత ఎయిర్ పోర్టు నుండి వస్తున్నప్పుడో, వెళుతున్నప్పుడో ఫోటోలు సామజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ ఉంటాయి. సమంత మయోసిటిస్ అనే వ్యాధితో బాధపడుతూ అందుకోసమని ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటున్న సంగతి కూడా తెలిసిందే. ఆమె చివరి సినిమా 'ఖుషి' విడుదలైంది, ఆ తరువాత ఆమె సినిమాలు ఏమీ కొత్తవి ఒప్పకోలేదు, కానీ నిర్మాతగా కొన్ని సినిమాలు చేస్తాను అని చెప్పారు. ఈమె చెయ్యాల్సిన సినిమా ఒకటి ఇప్పుడు శృతి హాసన్ చేస్తున్నారు. అంటే సమంత ఇప్పట్లో సినిమాలు చేసే పరిస్థితి కనిపించడం లేదు అని తెలుస్తోంది.

అయితే ఇంతకీ సమంత మళ్ళీ వెండితెర మీద కనిపించదా, అనే సందేహం కూడా ఆమె అభిమానుల్లో చోటుచేసుకుంటోంది. ఎందుకంటే ఆమె చివరి సినిమా 'ఖుషి' గత సంవత్సరం సెప్టెంబర్ 1న విడుదలైంది. ఆ సినిమా విడుదలవ్వకముందే సమంత అమెరికా వెళ్లి అక్కడ విశ్రాంతి తీసుకుంది. మళ్ళీ ఇండియా వచ్చింది, ఇక్కడ సినిమాలు చెయ్యడం లేదు కానీ, చాల చురుకుగా సామజిక మాధ్యమాల్లోనూ, అలాగే కొన్ని షోస్ లో కనపడుతూ అభిమానులను అలరిస్తున్నారు.



# నటి కీర్తి సురేశ్‌కు భారీ ఫ్యాన్స్ ఫాలోయింగ్



మహానటి సినిమాతో దేశవ్యాప్తంగా బాగా క్రేజ్ తెచ్చుకున్న కీర్తి సురేష్ కెరీర్ ఒక్క అడుగు ముందుకేస్తే రెండడుగులు వెనుకకు అన్నట్లుగా ఉంది. 2023లో తెలుగులో దసరా, భోళా శంకర్ రెండు సినిమాలు, తమిళంలో మామన్నన్ అనే మూడు సినిమాలు చేయగా ఈ యేడు తెలుగులో ఇప్పటికీ ఒక్క సినిమా కూడా సంతకం చేయకపోవడం గమనార్హం. గర్ల్ నెక్స్ట్ డోర్ వంటి క్యారెక్టర్లతో మొదలు పెట్టి నిత్యం వైవిధ్యభరిత పాత్రలను చేసుకుంటూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం బాలీవుడ్ మీద దృష్టి పెట్టింది. ఇప్పటికే తేరి అనే తమిళ సినిమా బాలీవుడ్ రిమేక్ బేబీ జాన్‌లో వరుణ్ దావన్‌తో కలిసి నటిస్తుండగా, ఓ వెబ్ సిరీస్‌లోనూ నటిస్తోంది. అదే విధంగా తమిళంలో రఘు తాత, రివాల్వర్ రిటా, సైరెన్, కన్నివేడి వంటి నాలుగు చిత్రాలలో నటిస్తోంది కీర్తి సురేష్ . ఇప్పటివరకు సౌత్ ఇండియా అన్ని ఇండస్ట్రీలలోను మంచి పాపు లారిటీని సంపాదించు కున్న ఈ నటికి ఫ్యాన్ బేస్ భారీగానే ఉండగా సోషల్ మీడియా లోను చాలా యాక్టివ్‌గా ఉంటుంది. అయితే ఈ ఫ్యాన్స్ విషయంలోనే తాజాగా ఓ వార్త నెట్టింట బాగా వైరల్ అవుతున్నది. విషయానికి వస్తే.. కృష్ణ అనే ఓ వీరాభిమాని కీర్తికి డైహర్డ్ ఫ్యాన్. ఈ క్రమంలో కీర్తికి సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఎక్స్‌లో ఇప్పటివరకు 233 లేఖలు రాయడమే కాకుండా వాటికి రిప్లై ఇవ్వాలని చాలాసార్లు కోరాడు. చివరకు 234వ లెటర్‌కు స్పందించిన కీర్తి ఇంత ఆలస్యంగా సమాధానం ఇచ్చినందుకు క్షమాపణలు కోరింది. మీలాంటి అభిమాని నాకు లభించడం నా అదృష్టం అని, ఆ నెంబర్ నాకు ఫాంటసీ నెంబర్ అని చెప్పి తన అభిమానిని ఖుషీ చేసింది. సడన్‌గా కీర్తి ఓ ఫ్యాన్ కామెంట్స్‌ను చదివి సమా ధానం ఇవ్వడంతో ఆమె ఫ్యాన్స్ చాలా హ్యాపీగా ఫీలవుతూ ఆమె ట్వీట్‌ను రీ ట్వీట్ చేస్తున్నారు.

# ఊరిపేరు భైరవకోన విడుదల తేదీల్లో మార్పు

సంక్రాంతి పండగ నాడు నాలుగు సినిమాలు విడుదలయ్యాయి. అయితే అప్పుడు ఐదో సినిమా రవితేజ నటించిన 'ఈగల్' కూడా విడుదలవ్వాల్సి వుంది కానీ, నిర్మాతల మండలి, తెలుగు ఫిలిం ఛాంబర్ అఫ్ కామర్స్ ఆ సినిమా నిర్మాతల మధ్య సయోధ్య కుదిర్చి 'ఈగల్' సినిమాని వాయిదా వేసుకోమని చెప్పారు. అప్పుడు పోటీ లేకుండా చేస్తామని కూడా ఆ సినిమా నిర్మాతకి హామీ ఇచ్చారు. తరువాత 'ఈగల్' ఫిబ్రవరి 9న విడుదల చెయ్యాలని నిర్ణయించుకొని ఆ తేదీని ప్రకటించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణ సంస్థ. తరువాత సందీప్ కిషన్ తన సినిమా 'ఊరి పేరు భైరవకోన' అనే సినిమాని ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నట్టుగా ప్రకటించారు. ఈ సినిమాకి నిర్మాత రాజేష్ దండా, దర్శకుడు విఐ ఆనంద్. ఇది ఒక ఫాంటసీ నేపథ్యంలో తీసిన సినిమా. ఈ సినిమా ప్రచారాలు కూడా మొదలెట్టేసారు, ఫిబ్రవరి 9 తప్పితే మాకు ఇంకా వేరే తేదీ లేదు విడుదల చెయ్యడానికి అని కూడా ఒక ప్రచార ఈవెంట్ లో చెప్పేసాడు సందీప్ కిషన్. ఇది తెలిసి పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ కొన్ని రోజుల క్రితం, నిర్మాతల మండలికి, తెలుగు ఫిలిం ఛాంబర్ అఫ్ కామర్స్ కి ఒక లేక రాశారు. అందులో తన సినిమా 'ఈగల్' విడుదలప్పుడు పోటీ లేకుండా చేస్తామని మాటిచ్చారు, ఆ మాట నిలబెట్టుకోండి అని చెప్పారు. అందుకోసమని ఈరోజు నిర్మాతల మండలి, తెలుగు ఫిలిం ఛాంబర్ అఫ్ కామర్స్ సమావేశం నిర్వహిస్తున్నారు. అందులో 'ఊరు పేరు భైరవకోన' సినిమా విడుదల వాయిదా వేసుకోమని ఆ సినిమా నిర్మాతకి చెపుతారని తెలిసింది. అతను కూడా ఇంకో కొత్త విడుదల తేదీని ప్రకటించనున్నారని కూడా తెలిసింది.




Edited,printed,published and Owned by sredharPrinted at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com